క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో జనావాసాల మధ్య ఖాళీగా ఉన్న స్థలాల పరిశుభ్రతపై మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. పట్టణంలోని పలుచోట్ల ఉన్న ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు, మురుగు నీటి తొలగింపు చేపట్టేందుకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక 6వ వార్డు కాకానినగర్‌లో ఖాళీస్థలాన్ని శుభ్రం చేసే పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పర్యవేక్షించారు. అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

లేగదూడల ప్రదర్శన



గొట్టుముక్కల(కంచికచర్ల) : మండలంలోని గొట్టుముక్కలలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యి దూడలు మాత్రమే పుట్టే సెమెన్ అందుబాటులో ఉందని, రైతులు పెయ్యిదూడల సంతతిని పెంచుకోవాలని సూచించారు. లేగదూడల ప్రదర్శనలో 40 పెయ్యిదూడలు పాల్గొనగా, మొదటి బహుమతిని మద్దినేని రామారావు, ద్వితీయ బహుమతిని బొజ్జా సావిత్రి, తృతీయ బహుమతిని బండిబోయిన రామారావు దూడలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో గండేపల్లి పశు వైద్యశాల వైద్యాధికారి ఎం నవీన్‌కుమార్ , సర్పంచి టి.రాజ్‌కుమార్, నందిగామ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు కే వెంకటేశ్వరరావు, వైద్యశాఖ సహాయకులు అనిల్, మానస, ప్రియాంక, భువన్, విక్రమ్, చోడగిరి సతీష్‌కుమార్, పశుపోషకులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



శివాపురం(పెనుగంచిప్రోలు):మండలంలోని ముచ్చింతాల గ్రామ రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన దైద శ్రీనివాసరావు కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. దైద శ్రీనివాసరావు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా, మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులంతా కలసి రూ.35వేలను ఆర్థికసాయంగా అందించారు.ఈ మొత్తాన్ని ఎంపీపీ మార్కపూడి గాంధీ చేతుల మీదుగా శ్రీనివాసరావు భార్య క్రాంతికుమారికి బుధవారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ శ్రీనివాసరావు కుటుంబం ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం నుంచి సాయం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యురాలు బేరుతుల నాగమణి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాధ్యక్షుడు లగడపాటి జనార్దన్, మాజీ సర్పంచ్ లగడపాటి మోహనరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 17వ వార్డు పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ముఖ్యంగా ఫాగింగ్, నీరు నిల్వ ఉండేచోట ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడం, ఎబేట్ పిచికారి చేయడం తదితర తీసుకుంటున్నట్లు తెలిపారు. కమిషనర్ వెంట వార్డ్ కౌన్సిలర్ బాపట్ల సాంబయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

కంచికచర్ల : అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పరిటాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సీఎం జగన్ ఆలోచనన్నారు. ప్రజారోగ్యం విషయంలో మన రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. అందరూ ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యులు కర్ల రాధిక, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయభూషణరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మార్త రజిని, డీఎల్‌పీవో పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.శిల్ప, సూపరిండెంటెంట్ కె.బాలశంకరరావు, ఎంఈవో బి.బాలాజీ, పీహెచ్‌సీ వైద్యులు కె.మధురిమ, శ్రావణ్‌కుమార్, నాయకులు మార్త శ్రీనివాసరావు, జమలయ్య, జాన్‌బాబు, ఏసుబాబు, యద్దనపూడి విజయారావు, వేముల నాగరాజు, జీవరాజు, కంచర్ల పద్మావతి, వేల్పుల రమేష్, పరిటాల రాము, మార్త శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు మీర్జావలి, కనగాల రవికుమార్, గ్రామ సచివాయ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాగల్లులో 615మందికి వైద్యపరీక్షలు

నందిగామ: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ తెలిపారు. నందిగామ మండలంలోని మాగల్లు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ వైద్యశిబిరాన్ని రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో వలంటీర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ప్రభుత్వం అందరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటుందన్నారు. వారికి చక్కటి వైద్యాన్ని అందిచడం ద్వారా వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని వివరించారు. ఈ శిబిరంలో 615 మంది రోగులకు ప్రత్యేక వైద్యుల బృందం వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసింది. గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు కే శోభారాణి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



పరిటాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు



మాగల్లులో మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న కొమ్మినేని రవిశంకర్, నాయకులు

పెనుగంచిప్రోలు మండలంలో..

శివాపురం(పెనుగంచిప్రోలు):సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ మార్కపూడి గాంధీ పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శివాపురంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి 560మంది హాజరుకాగా, వారికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగనన్న వైద్య రంగంలో నూతన ఒరవడిని సృష్టించారని కొనియాడారు. పేద ప్రజలకు పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఉపసర్పంచ్ తాళ్లూరి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు బేరోతుల నాగమణి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాధ్యక్షుడు లగడపాటి జనార్దన్, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మాజీ సర్పంచ్ లగడపాటి మోహనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కురువెళ్ల రాయప్ప, వెంకటరమణ, వైద్యులు సుజని, నాగరాణి, సింధూర, ఏవో సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

దేచుపాలెం(వత్సవాయి) : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని దేచుపాలెం సర్పంచ్ బొల్లం నారాయణప్రసాద్ కొనియాడారు. మండలంలోని దేచుపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల ఇళ్లవద్దకే వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చారని వివరించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జయంతిపురం(జగ్గయ్యపేట): జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని జయంతిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని గ్రామసర్పంచ్ లాహోరు నరసింహారావుతో కలిసి ఎంపీడీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బందులు పడుతున్న వారితోపాటు అందరికి వైద్య పరీక్షలు చేయడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోగలుగుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. భూచవరం వైద్యాధికారులు అనిల్‌కుమార్, స్రవంతి, కీర్తిరెడ్డి, ప్రభుత్వ స్పెషలిస్ట్ వైద్యులు భారతి, చావ్లా పాల్గొని 506మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి, ఈవోపీఆర్డీ సాంబశివరావు, కార్యదర్శి రామారావు, అంగన్‌వాడీలు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

పెద్దాపురం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంతో వైద్య సేవలను ప్రజల ఇళ్ల ముంగిటకు తీసుకువచ్చారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. మండలంలోని పెద్దాపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కమీషన్‌ల కోసం కక్కుర్తిపడి ప్రజా వైద్యాన్ని నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం నిరుపేదలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని తలదన్నేలా వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, వైద్యాధికారులు దీపిక, గౌతమ్, నాయకులు పాల్గొన్నారు.



జయంతిపురంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు, నాయకులు



శివాపురంలో మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యురాలు, నాయకులు,

చందర్లపాడు మండలంలో..

చందర్లపాడు(నందిగామ టౌన్): వైద్యరంగానికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం గుడిమెట్లలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు రాష్ట్ర వ్యాప్తంగా స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు మేలైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ వైద్యారోగ్య సిబ్బంది వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను సేకరిస్తూ వారికి అవసరమైన వైద్యసేవలు అందేలా చూస్తున్నారన్నారు. ఇటువంటి సేవలు గత ప్రభుత్వాల హయాంలో బూతద్దం వేసుకుని వెతికినా కనిపించలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తయినందున ప్రజలకు అవసరమైన కార్యక్రమాలను చేపడుతూ నిరుపేదలకు అండగా ఉంటున్నారని కొనియాడారు. నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, బత్తిన వెంకటేశ్వరరావు, ఆల ప్రభు, పలువురు నాయకులు, కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మంచి చేశారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం తుర్లపాడు, ముప్పాళ్ల గ్రామాల్లో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మోహనరావు మాట్లాడుతూ ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదురైనా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహనరెడ్డికే దక్కిందన్నారు. కరోనా మహమ్మారి ధాటిని సైతం సమర్థంగా ఎదుర్కొన్ని అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందించారని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించడంతోపాటు అంతర్గత రహదారులను సైతం సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి ఆయన మరోసారి సీఎం అయ్యేందుకు భారీ విజయాన్ని అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెర్మసాని నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. స్థానిక 6 వ వార్డు కాకానినగర్‌లో బుధవారం ఇందిర మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాఘవేంద్ర మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. స్వయం సహాయ సంఘాల బలోపేతం కోసం 12 అంశాలపై గ్రేడింగ్ ఇస్తూ, మార్కుల ఆధారంగా రుణాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తూ మహిళలు ఆయా రంగాల్లో అభ్యున్నతిని సాధించేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, మెప్మా సీఎంఎం శ్రీధర్, సీవో నిర్మల, టీఎల్ఎఫ్ ఓబీలు నర్సమ్మ, సంపూర్ణమ్మ, ఇందిర ఎస్ఎల్ఎఫ్ సభ్యులు, సమైఖ్య ఓబీలు, ఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



శివాపురంలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ గాంధీ, డాక్టర్ సృజన, నాగరాణి, నాయకులు, ఆశవర్కర్లు



అన్నవరం పాఠశాలలో బాలిక విద్య ఆవశ్యకతను వివరిస్తున్న ఉపాధ్యాయురాలు

శివాపురం(పెనుగంచిప్రోలు): బాలికల ఆరోగ్యంపై తల్లులు శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ సృజన, నాగరాణి సూచించారు. అంతర్జాతీయ ఆడపిల్లల దినోత్సవం సందర్భంగా మండలంలోని శివాపురంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదన్నారు. ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వం కూడా ఎన్నో చట్టాలు, రక్షణ చర్యలు చేపట్టిందని వివరించారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ మాట్లాడుతూ ఆడపిల్లలను చులకన చేయరాదని, మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను కూడా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంపీటీసీ సభ్యురాలు బోరుతుల నాగమణి, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాధ్యక్షుడు జనార్దన్, మాజీ సర్పంచ్ లగడపాటి మోహనరారావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, నాయకులు రాయప్ప, వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో...

అన్నవరం(జగ్గయ్యపేట): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నవరంలో పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు ×అమ్మాయి చదువు అవనికే వెలుగు× అంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు లక్ష్మి, జ్ఞానేశ్వరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మాజీసర్పంచ్ 'కోటేరు'కు ఎమ్మెల్యే పరామర్శ

అల్లూరు(వీరులపాడు): మండలంలోని అల్లూరు మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణరెడ్డిని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం పరామర్శించారు. సూర్యనారాయణరెడ్డి ఇటీవల మోకాళ్ల శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలను పాటించి, త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. సూర్యనారాయణరెడ్డిని పరామర్శించిన వారిలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ బందెల రాణి, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు బాయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వేమిరెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.



కోటేరు సూర్యనారాయణరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మొండితొక జగన్‌మోహనరావు

హోరెత్తిన నిమజ్జనాల సందడి



జగ్గయ్యపేట అర్బన్ : గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 24వ రోజు బుధవారం గణేష్ నిమజ్జన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కూడళ్లలోని చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహాలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన ఊరేగింపులో యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగులు చల్లుకున్నారు. గణేష్ మహరాజ్‌కు జై అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల్లో సాగిన ఊరేగింపులు ముక్త్యాల, వేదాద్రి ఘాట్ వద్ద విగ్రహాలను కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు తరలివెళ్లాయి. డాక్టర్స్ రోడ్‌లో రైడర్స్ యూత్ ఆధ్వర్యంలో సుమారు రూ.7లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 24 అడుగుల గణేష్ విగ్రహం ప్రత్యేకాకర్షణగా నిలిచింది. రైడర్స్ యూత్ సభ్యులు అరవింద్, చందు, రాజు, భక్తులు పాల్గొన్నారు.

మంచినీటిని అందిచేందుకు చర్యలు

చందర్లపాడు(నందిగామ టౌన్): ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం గుటిమెట్లలోని రక్షిత మంచి నీటి పథకం పంప్‌హౌస్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విచ్చేసిన తనకు కలుషిత నీరు సరఫరా అవుతున్నాయని గ్రామస్తులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పంప్ హౌస్‌ను పరిశీలించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. నీటి కలుషితానికి ఆస్కారం లేకుండా సురక్షితమైన నీటిని సరఫరా చేసేలా చూస్తామన్నారు. వాటర్ పైప్‌లైన్‌ల లీకేజీలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పారుపల్లి హరిబాబు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నందిగామ(చందర్లపాడు): సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో చందర్లపాడు మండలంలోని కొత్తపాలెంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత, స్వచ్ఛత అనే అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఆర్థికంగా కుటుంబం ఎదగాలంటే చేయవలసిన పనులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామీణ బ్యాంక్ మేనేజర్ డి.మహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ అధికారి ఎన్.బ్రహ్మయ్య, సర్పంచ్ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

వీరులపాడు: మండలంలో చేపట్టిన నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మహేశ్వరరావు ఆదేశించారు.వీరులపాడులోని ఎంఈవో కార్యాలయంలో నాడు-నేడు కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అమ్మఒడి పథకంపై విద్యార్థుల తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని సూచించారు. జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద పథకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కెనడీ, ఏఈ ప్రేమ్‌కుమార్, సీఎంవో వెంకటేశ్వరరావు, అంగనవాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

చందర్లపాడు(నందిగామ టౌన్):ప్రజలకు జవాబుదారీ పాలన అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలంలోని కోనాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ. 17.5 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించినట్లు చెప్పారు. సచివాలయాల ద్వారా 600 రకాల ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించటం జరుగుతుందని తెలిపారు. ప్రతి 2,500 మంది జనాభాకు ఒక హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి ప్రజలకు వారి ఇళ్ల వద్దనే మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుగ్గినేని సురేష్, వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, కమతం వెంకట నర్సిరెడ్డి, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెనుగంచిప్రోలు:మండల కేంద్రం పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మవారి ఆలయం సమీపంలోని గౌరీశంకర్ రైస్‌మిల్ వద్ద నుంచి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పాల్గొంటారని వివరించారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరాలు

కంచికచర్ల : మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో కే బాలశంకరరావు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొంటారని వివరించారు.

మక్కపేటలో..

వత్సవాయి: మండలంలోని మక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కొమరగిరి సంక్రాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అనారోగ్యంతో బాధపడేవారిని గుర్తించి ఈ వైద్యశిబిరంలో వారికి వైద్యపరీక్షలు జరిగేలా చూడాలని వలంటీర్లను ఆదేశించారు.

సుబ్బాయిగూడెంలో...

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని సుబ్బాయిగూడెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్‌పీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.